క్లుప్తంగా

కొత్త వెలుగులు నిండాలి

• ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం : ఉగాది పర్వదినం నుంచి జిల్లా ప్రజలు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల జీవితాల్లో కష్టాలు తొలగి, కొత్త వెలుగులు నిండాలని కోరుకుంటున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. తెలుగు సంవత్సరాది సందర్భంగా మంగళవారం ఆయన ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో ఆనందం నిండాలని కోరుకున్నారు.

తెలుగు సంవత్సరాదికి కళా స్వాగతం



మామిడికాయపై చిత్రీకరించిన ఉగాది ప్రత్యేకత

ముత్తుకూరు : మండలంలోని బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థిని డి.హిమశర్వాణి మంగళవారం మామిడికాయ, మామిడాకులపై ఉగాది పర్వదిన ప్రత్యేకను కళాత్మకంగా చిత్రీకరించింది. శోభకృత్ నామ నూతన తెలుగు సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, తన చిత్రం ద్వారా షడ్రుచుల స్వరూపాన్ని ఆవిష్కరించింది.

రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారి

పొదలకూరు : మండల పరిధిలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో పనిచేసే ఎంపీహెచ్‌ఓలకు సంబంధించి రికార్డులను మండల వైద్యాధికారి డాక్టర్ రమేష్ పొదలకూరులోని తన కార్యాలయంలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల 21న ఎంపీహెచ్‌ఓల రికార్డులను పరిశీలిస్తామన్నారు. వారితీరును బట్టి జీతాలను చెల్లిస్తామన్నారు. రికార్డుల్లో వారు అందించిన సేవలు, క్లినిక్‌కు హాజరైన రోగులు తదితర వివరాలు కూడా ఉంటాయన్నారు.

సన్మానం



స్వరాజ్‌ను సన్మానించిన పాస్టర్లు

పొదలకూరు : వైఎస్సార్‌సీపీ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు లక్కు స్వరాజ్‌ను మండలంలోని డ్యామ్‌రోడ్డు సమీపంలో ఉన్న ప్రార్థన మందిరంలో పాస్టర్లు మంగళవారం సన్మానించారు. పాస్టర్ ఏసురత్నం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. అబ్రహాం, యాకోబు, డేవిడ్‌రాజు, సునీల్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఆవశ్యకతపై ప్రదర్శన

కొడవలూరు : చిరుధాన్యాల ఆవశ్యకతపై వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలోని సంఘ బంధం మహిళలు మంగళవారం కొడవలూరులో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం ఎస్.రుక్మిణి మాట్లాడుతూ పెరటి తోటల పెంపకంలో భాగంగా చిరుధాన్యాలను సాగు చేసుకోవాలని చెప్పారు. సీసీలు సుకన్య, ఉదయ్‌కుమార్, వీఓఏలు కోటేశ్వరి, కవిత పాల్గొన్నారు.

సంపద కేంద్రాల పరిశీలన

మనుబోలు : మండల పరిధిలోని గురివింద పూడి గ్రామంలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)ను ఎంపీడీఓ వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. షెడ్డులో తయారు చేసిన వర్మీ కంపోస్టు గురించి కార్యదర్శి అనితను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వెయ్యి కేజీల ఎరువు విక్రయానికి సిద్ధంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈఓపీఆర్డీ రమణయ్య, వైఎస్సార్‌సీపీ నేత మన్నెమాల సుధీర్‌రెడ్డి ఉన్నారు.

కాలువ నిర్మాణంపై హర్షం



మాట్లాడుతున్న స్థానికులు

మనుబోలు : తమ ప్రాంతంలో మురుగు కాలువ నిర్మించి సమస్యను పరిష్కరించినందుకు మండలంలోని జట్లకొండూరు అరుంధతీయవాడ ప్రజలు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎంతో కాలంగా ఉన్న సమస్యను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గుర్తించి రూ.5 లక్షల నిధులతో కాలువను నిర్మించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉపసర్పంచ్ ఆవుల తులసీరాం, నేతలు బధిపూడి సురేష్, ఈపూరు రవీంద్ర ఉన్నారు.

రాగిజావతో రక్తహీనతకు చెక్

• పాఠశాలల విద్యార్థులకు రాగిజావ పంపిణీ

కొడవలూరు : రాగిజావతో రక్తహీనత సమస్యలకు చెక్ పెట్టవచ్చని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాగిజావలో ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉండడంతో రక్తహీనత, ఎముకల బలహీనత లాంటి సమస్యలు తలెత్తే అవకాశం లేదన్నారు. ఎంఈఓ జి.వసంత కుమారి మాట్లాడుతూ పాఠశాలల్లో అమలు చేసే జగనన్న గోరుముద్ద పథకంలో పోషకాలున్న ఆహార పదార్థాలనే ఇస్తున్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, ఏపీఎం ఎస్.రుక్మిణి, హెచ్‌ఎం డి.ఓబులేసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బృహత్తర కార్యక్రమాలు

ఇందుకూరుపేట : పేద విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర కార్యక్రమాలు చేపడుతోందని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమీకృత ఆహారంలో భాగంగా విద్యార్థులకు రాగిజావ పంపిణీని ఆయన మంగళవారం ప్రారంభించారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కల్పన, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బీవీ రమణయ్య, నేతలు శ్రీనివాసులురెడ్డి, దిల్షాద్ పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, అధికారులు



కొడవలూరు : విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ



ఇందుకూరుపేట : రాగిజావను పంపిణీ చేస్తున్న పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్

కోవూరులో..

మండల కేంద్రంలోని పాఠశాలలో డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి రాగిజావను విద్యార్థులకు పంపిణీ చేశారు.

ఆరోగ్యం మరింత పటిష్టం

బుచ్చిరెడ్డిపాళెం : జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావ అందించడంతో పిల్లల ఆరోగ్యం మరింతగా పటిష్టంగా మారుతుందని ఎంపీపీ శ్రీనివాసులు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం రాగిజావ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగిజావతో విద్యార్థులకు పౌష్టికాహార లోపం తగ్గుతుందన్నారు. అలాగే దామరమడుగు, పెనుబల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావను అందించారు. ఎంపీడీఓ నరసింహారావు, ఎంఈఓ దిలీప్, సర్పంచ్ పెంచలయ్య, హెచ్‌ఎం సుజాత, వీసీ చైర్‌పర్సన్ లక్ష్మి పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు : సౌత్‌ఆములూరు పాఠశాలలో..

విద్యార్థులకు వరం

తోటపల్లిగూడూరు : జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాగిజావను పంపిణీ చేయడం విద్యార్థులకు వరమని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు చెరుకూరు శ్రీనివాసులునాయుడు పేర్కొన్నారు. మండలంలోని సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామానుజయ్య, టీచర్లు సుభాషిణి, అహ్మద్‌బాషా పాల్గొన్నారు.

• **పొదలకూరు :** మండల పరిధిలోని పాఠశాలల్లో రాగిజావ పంపిణీని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ విద్యార్థినులకు రాగిజావను అందజేశారు. డీఎన్నార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కె.సనత్‌కుమార్ విద్యార్థులకు రాగిజావను పంపిణీ చేశారు. పీసీ చైర్మన్ సురేఖ పాల్గొన్నారు.



పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ పాఠశాలలో..



కోవూరు మండల కేంద్రంలో..



మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

• **మనుబోలు :** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని హెచ్‌ఎం డేవిడ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంత్రి కాకాణి సహకారంతో రాగిజావను పంపిణీ చేశామని, ఇకపై ప్రభుత్వమే పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీ చైర్మన్ సునీత, కో–ఆప్షన్ సభ్యుడు అనమాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం

• నెల్లూరు ఆర్డీఓ మలోల

పొదలకూరు : రీసర్వేతో చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని, ఈ మేరకు ప్రభుత్వం జీఓను జారీ చేసినట్లు నెల్లూరు ఆర్డీఓ ఎ.మలోల పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విరువూరు రైతులతో సమావేశానికి ఆర్డీఓ మంగళవారం విచ్చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు రెవెన్యూ డివిజన్లో 17 వేల ఎకరాల చుక్కల భూములు ఉన్నట్లు తెలిపారు. జీఓ వల్ల ఎందరో రైతులకు ఉపశమనం కలుగుతోందన్నారు. 79 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామని, త్వరలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి ఉన్నందున అసైన్మెంట్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించడంలో జాప్యం జరిగిందన్నారు. నియమావళి తొలగించినందున వీలైనంత త్వరలో సమావేశం జరుగుతుందన్నారు. మేత, వాగు, చెరువు, కాలువ పోరంబోకు భూములకు పట్టాలు ఇవ్వడం కుదరదన్నారు.



రైతులతో సమావేశమైన ఆర్డీఓ మలోల

విరువూరు రైతులతో సమావేశం

మండలంలోని విరువూరుకు చెందిన ఏడుగురు రైతులు 2015లో నెల్లూరు నగరానికి తాగునీటి అవసరాల కోసం పైపులైన్ నిర్మాణానికి 1.50 ఎకరాల భూమిని అందజేశారు. అయితే వారికి ఇప్పటి వరకు పరిహారం అందలేదు. దీంతో ఆర్డీఓ మలోల రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విరువూరు గ్రామానికి వెళ్లి రైతులు అందజేసిన భూములను పరిశీలించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ గణేష్‌కుమార్, ఆర్‌ఐ నవీన్, వీఆర్వో హరికృష్ణ ఉన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మనుబోలు : గర్భిణికి పౌష్టికాహారాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



కొడవలూరులో పప్పుధాన్యాల ఆవశ్యకతను వివరిస్తున్న ఎంపీడీఓ, సూపర్‌వైజర్‌లు

మనుబోలు : మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మనుబోలు చంద్రమౌళినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో అందించే పోషకాహారాన్ని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తప్పకుండా తీసుకోవాలన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరమ్మ, అంగన్‌వాడీలు సుగుణమ్మ, కామేశ్వరి, నిర్మల, లక్ష్మి, మునెమ్మ, సుజన, విజయమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు మహేంద్రవర్మ, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొడవలూరులో పోషకాహార మేళా

కొడవలూరు : పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మేళాను మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, సెక్టార్ సూపర్‌వైజర్ వి.పద్మావతి హాజరై పప్పుధాన్యాల ఆవశ్యకతను తెలియజేశారు. మినుము ఇతర పప్పుధాన్యాలను ఆహార పదార్థాలుగా వినియోగించడంపై ప్రయోగాత్మకంగా వివరించారు. వీఆర్వో రఘురామయ్య పాల్గొన్నారు.

నార్తురాజుపాళెంలో..

నార్తురాజుపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మేళాను నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ, సచివాలయ కార్యదర్శి విజయకుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పనులు కల్పించాలి

• అడిషనల్ పీడీ నిర్మలాదేవి

బుచ్చిరెడ్డిపాళెం : అర్హులైన ప్రతిఒక్కరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ అడిషనల్ పీడీ నిర్మలాదేవి ఆదేశించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 15వ బహిరంగ సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2021–22లో మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన పనులకు రూ.1.52 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇవి సక్రమంగా జరిగాయా.. లేదా అనే కోణంలో గ్రామస్థాయిలో సామాజిక తనిఖీలు చేపట్టామని, అనంతరం మండల స్థాయిలో గ్రామసభ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పనుల్లో ఎక్కడా అవకతవకలు జరగలేదని గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ మృదుల, డ్వామా విజిలెన్స్ అధికారి సురేష్‌బాబు, క్వాలిటీ కంట్రోల్ అధికారి వేణుగోపాల్, ఎంపీడీఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

‘వెలుగు’ అక్రమాలపై విచారణకు ఆదేశం

పొదలకూరు : గత ప్రభుత్వంలో వెలుగు కార్యాలయంలో పనిచేసిన అధికారులు, సిబ్బంది పొదుపు మహిళల సొమ్ము స్వాహా చేశారని మండలంలోని మొగళ్లూరు పొదుపు సంఘాల మహిళలు స్పందనలో చేసిన ఫిర్యాదుపై జిల్లా అధికారులు స్పందించారు. సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాల్సిందిగా ఆదేశిస్తూ విచారణాధికారిగా ఏరియా కో–ఆర్డినేటర్ శ్రీనివాస్‌ను పంపారు. ఆయన వెంట గతంలో ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన చిన్నయ్య, రెహనాబేగం ఉన్నారు. బాధిత పొదుపు మహిళలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి సీసీ వెంకటేశ్వర్లు విచారణకు హాజరయ్యారు. మహిళలు నగదును చెల్లించినట్టుగా ఉన్న ఆధారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి ఆదేశాల మేరకు విచారణకు హాజరైనట్లు తెలిపారు. అందరి స్టేట్‌మెంట్లు రికార్డు చేసి నివేదికను పీడీకి అందజేస్తామన్నారు.



కార్యాలయంలో విచారణ నిర్వహిస్తున్న అధికారులు

విచారణపై విమర్శలు

అధికారుల విచారణపై పొదుపు మహిళలు విమర్శలు చేశారు. నిధులు దుర్వినియోగం అయిన సమయంలో ఏపీఎంగా ఉన్న రాధ భర్త చిన్నయ్య విచారణ అధికారుల్లో ఒకరుగా రావడం ఏమిటని ప్రశ్నించారు. తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం సన్నగిల్లుతున్నట్లు వాపోయారు. అనంతరం ఎంపీడీఓ నగేష్‌కుమారిని కలిసి బాధితులు విన్నవించుకున్నారు.

‘రత్నం’లో వార్షిక వేడుక

ముత్తుకూరు : మండలంలోని పిడతాపోలూరులో ఉన్న రత్నం ఫార్మసీ కళాశాలలో వార్షిక వేడుకలు మంగళవారం జరిగాయి. కళాశాల చైర్మన్ కె.వేణుగోపాల్ జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. మేనేజర్ సుధాకర్‌నాయుడు, ప్రిన్సిపల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటారు బైక్ అదుపుతప్పిన ప్రమాదంలో వ్యక్తి గాయపడిన సంఘటన మండలంలోని కాకుటూరు వద్ద మంగళవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన మనోహర్ పనినిమిత్తం బైక్‌పై గూడూరుకు వెళ్తుండగా కాకుటూరు వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో మనోహర్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్థలం ఆక్రమణపై విచారణ

ముత్తుకూరు : మండలంలోని ఈపూరు వెంకనపాళెం జెడ్పీ హైస్కూల్ స్థలం ఆక్రమణ జరిగిందన్న అంశంపై డీఈఓ గంగాభవాని ఆధ్వర్యంలో మంగళవారం విచారణ నిర్వహించారు. హైస్కూల్‌కు చెందిన స్థలాన్ని భానుకృష్ణమూర్తి అనే వ్యక్తి ఆక్రమించినట్లు నాసిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి ఇటీవల హైకోర్టుకు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించాలంటూ హైకోర్టు ఆదేశించడంతో అధికారులు రంగంలోకి దిగారు. డీఈఓతో పాటు స్థానిక తహసీల్దార్ మనోహరబాబు, ఎంఈఓ మధుసూదన తదితరులు ఇరు వర్గాల నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ, ఇరువర్గాల స్టేట్‌మెంట్లను హైకోర్టుకు సమర్పిస్తామన్నారు.

సమాజసేవలో ముందుండాలి

వెంకటాచలం : ప్రతిఒక్కరూ సమాజసేవలో ముందుండాలని విక్రమసింహపురి విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో మంగళవారం అంతర్జాతీయ సంఘ సంక్షేమ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో తమ వంతు పాత్ర పోషించాలన్నారు.

బుచ్చి వాసికి అవార్డు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా నరసింహులుకు నంది అవార్డు వరించింది. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ రాజమండ్రిలోని వై జంక్షన్‌లో ఉన్న రోటరీ క్లబ్ సెమినార్ హాల్లో జరిగిన ఉగాది ఉత్సవాల్లో ఆర్.నారాయణమూర్తి చేతుల మీదుగా నంది అవార్డును అందుకున్నట్లు తెలిపారు. తాను చేసిన సేవా కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజాయోనా ఆధ్వర్యంలో అవార్డును తనకు ప్రదానం చేసినట్లు తెలిపారు.

రేపటి వరకు దరఖాస్తుల స్వీకరణ

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలో ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డుల కోసం ఈనెల 23వ తేదీ వరకు నగర పంచాయతీలోని అన్ని సచివాలయాల్లో మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ మహిళలకు అవగాహన కల్పించారు.